ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

గురువారం 13 మార్చి 2025 www.prajaaswaramdaily.com 2 pm

# కేసీఆర్.. అసెంబ్లీలో చర్చకు రావాలి

## సీఎం రేవంత్‌రెడ్డి

ఢిల్లీ : కేసీఆర్ గవర్నర్ ప్రసంగానికి రావడం కాదు.. అసెంబ్లీలో చర్చలకు రావాలి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశాంగ మంత్రి జైశంకర్‌ను కలిసేందుకు ఢిల్లీ చేరుకున్న సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడారు.

గాంధీ కుటుంబంతో నాకు మంచి అనుబంధం ఉందన్నారు.

ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదు అని అన్నారు. నేను ఎవరో తెలియ కుండానే.. నన్ను పీసీసీ చీఫ్, ముఖ్య మంత్రిగా చేశారా అని ప్రశ్నించారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులను..కిషన్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. నేను ఆరు గ్యారంటీలకు నిధులు అడగడం లేదని తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్, మెట్రో, మూసీ ప్రాజెక్టులకు నిధులు అడుగుతున్నానని చెప్పారు. తెలంగాణలో నేను చేసినన్ని పాలసీలు ఎవరూ చేయలేదని వివరించారు. రాష్ట్రానికి రూ.2.2 లక్షలకోట్ల పెట్టుబడులు తెచ్చాం అని, నిరుద్యోగ రేటును 8.8 నుంచి 6.1 శాతానికి తగ్గించాం అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.



### అసెంబ్లీ వ్యవహారాలు.. సీఎం రేవంత్ దృష్టికి...

అసెంబ్లీ వ్యవహారాలను సీఎం రేవంత్ దృష్టికి మంత్రి శ్రీధర్‌బాబు తీసుకెళ్లారు. స్పీకర్‌పై జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలకు తదుపరి కార్యాచరణపై సీఎంతో చర్చించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు.

# స్పీకర్ vs జగదీశ్

## ఈ సభ మీ సొంతం కాదు

### సభ అందరిదీ సభ్యులందరికీ సమాన అవకాశాలుంటాయి


### స్పీకర్ ను ఉద్దేశించి ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి వ్యాఖ్యలు

### క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు డిమాండ్




హైదరాబాద్: అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షల మధ్య మాటల మంటలు రేకెత్తించాయి. అసెంబ్లీ లో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సభలో దుమారం రేగింది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్‌బాబు , కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ''ఈ సభ అందరిదీ.. సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉన్నాయి. మా అందరి తరఫున పెద్ద మనిషిగా, స్పీకర్‌గా మీరు కూర్చున్నారు. ఈ సభ మీ సొంతం కాదు'' అని వ్యాఖ్యానించారు. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారని స్పీకర్ ఆక్షేపించారు.







### ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

### మంత్రి శ్రీధర్ బాబు

జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. స్పీకర్‌ను దూషించేలా ఆయన మాట్లాడారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడిన ప్రతి పదాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన అహంకారంతో మాట్లాడకుండా క్షమాపణ చెప్పాల్సిందే నన్నారు.

### జగదీశ్ ఏం తప్పు మాట్లాడారు

### ఎమ్మెల్యే హరీశ్ రావు

ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ శ్రీధర్‌బాబు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డి ఏం తప్పు మాట్లాడారని ప్రశ్నించారు. సభలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయనడంలో తప్పులేదన్నారు. శాసనసభ అంటే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వానికి సంబంధించినది కాదన్నారు.

# ఎస్ఎస్ఎంబీ29 టీం నిర్ణయం సరైనదేనా?



హైదరాబాద్ : ఇటీవల ఒడిశాలో జరిగిన షూట్ వీడియో లీక్ కావడంతో ఎస్ఎస్ఎంబీ 29 ... టీం కఠిన నిర్ణయం తీసుకుందట. ఇక అవుట్ డోర్ షూట్స్ లేకుండా సెట్ నిర్మించి అందులోనే షూట్ చేస్తారని తెలిసింది. ఎంత సెక్యూరిటీ పెంచినా లీక్ ఏదో రూపంలో జరుగుతుందని, అందుకే ఇక ఔట్ డోర్ షూటింగ్స్ దాదాపు ఎవాయిడ్ చేయాలని అనుకుంటున్నాడట రాజమౌళి. కాశీలో తదుపరి షెడ్యూల్ జరగనుండగా, దాని కోసం ఏకంగా భారీ సెట్ నిర్మించి అందులోనే మూవీ చిత్రీకరణ జరపనున్నట్టు తెలుస్తుంది. ఇప్పుడు హైదరాబాద్‌లో భారీ కాశీ సెట్ కూడా రెడీ చేసారని టాక్.

# ఎల్లుండి నుంచి ఒంటిపూట బడులు

### వచ్చేనెల 23 వరకు హాఫ్ డే ...



హైదరాబాద్: ఎల్లుండి నుంచి తెలంగాణలో ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 23వ తేదీ వరకు హాఫ్ డే స్కూల్స్ కొనసాగుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు స్కూల్స్ నడుస్తాయి. టెన్త్ పరీక్షలు ఉన్న చోట మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్కూల్స్ కొనసాగుతాయి.

# లిఫ్ట్ మధ్యలో చిక్కుకొని బాలుడి మృతి

హైదరాబాద్ : హైదరాబాద్ లో మరో చిన్నారి లిఫ్ట్ కు బలయ్యాడు. ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంతోశ్ నగర్ కాలనీలో... ఓ అపార్ట్ మెంట్ లో హాస్టల్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ వాచ్ మెన్ గా పనిచేస్తున్న వ్యక్తి కుమారుడు సురేందర్ ప్రమాదవశాత్తు లిఫ్ట్ మధ్యలో ఇరుక్కుని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. చిన్నారి వయసు నాలున్నరేళ్లు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. సురేందర్ మృతదేహాన్ని బయటకు తీశారు. కళ్ల ముందు ఆడుతూపాడుతూ తిరిగిన పిల్లాడు.. అంతలోనే విగతజీవిగా మారడాన్ని చూసి ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు... ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో వరసగా లిఫ్ట్ ప్రమాదాలు సంభవించి పలువురు మృత్యువాత పడటం కలకలం రేపుతోంది.

# రాష్ట్రంలో భారత్ సమ్మిట్

### 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నాం..

### కార్యక్రమానికి కేంద్రం పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వాలి

### సీఎం రేవంత్

ఢిల్లీ : రాష్ట్రంలో నిర్వహించబోయే భారత్ సమ్మిట్ కార్యక్రమానికి అనుమతి కోసమే కేంద్ర విదేశాంగ శాఖ వద్దకు వచ్చినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. భారత్ సమ్మిట్ కు సుమారు 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్న సీఎం.. బరాక్ ఒబామా వంటి నేతలు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమానికి కేంద్రం పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉన్న నేపథ్యంలో ఇవాళ విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ , అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఎంపీలు సమావేశం కానున్నారు. మరోవైపు రాష్ట్రంలో మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిన కార్యక్రమాలు నెల రోజుల పాటు జరుగుతాయని సీఎం చెప్పారు. రాష్ట్ర పర్యాటక శాఖ అధికారిక భాగస్వామిగా ఉందన్న రేవంత్ రెడ్డి.....2 రోజుల్లో అధికారులతో కమిటీ నియమిస్తామని ఇష్టాగోష్ఠిలో వెల్లడించారు.

# 'డిలిమిటేషన్' పై అఖిలపక్ష సమావేశం

ఢిల్లీ : డి లిమిటేషన్ అనేది... లిమిటేషన్ ఫర్ సౌత్ అని సీఎం విమర్శించారు. 'డి లిమిటేషన్' అంశంపై తెలంగాణ అఖిలపక్ష సమావేశానికి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, జానారెడ్డి నేతృత్వంలో కమిటీ వేశానన్నారు. తమిళనాడులో స్టాలిన్ సమావేశానికి ముందే తెలంగాణ లో డి లిమిటేశన్ అంశంపై అఖిలపక్ష సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని కూడా ఆహ్వానిస్తామన్నారు. తెలంగాణలో అందరి అభిప్రాయాన్ని సేకరించిన తర్వాత డీఎంకే మీటింగ్ పై తమ వైఖరి చెప్తామని సీఎం స్పష్టం చేశారు..

# జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు సికింద్రాబాద్‌లో స్టాప్ రద్దు

### ఏప్రిల్ 25 నుంచి లింగంపల్లి నుంచి చర్లపల్లి మీదుగా...విశాఖ

హైదరాబాద్ : హైదరాబాద్ నుంచి విశాఖకు ... విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు ముఖ్య గమనిక. ఏప్రిల్ 25 నుంచి జన్మభూమి ఎక్స్ ప్రెస్ కు సికింద్రాబాద్ స్టాప్ రద్దు అయ్యింది. విశాఖ-లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్ ప్రెస్ ప్రయాణ మార్గం మళ్లించారు. చర్లపల్లి-అమ్ముగూడ-సనత్ నగర్ మీదుగా శాశ్వత ప్రాతిపదికన దారిమళ్లింపు చేశారు. ఏప్రిల్ 25 నుంచి లింగంపల్లి నుంచి చర్లపల్లి మీదుగా జన్మభూమి ఎక్స్ ప్రెస్ విశాఖ రానుంది.

